www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 31 మార్చి 2023

5

ఏలూరు



3 నుండి వైఎస్‌ఆర్ పింఛను కానుక

డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు

ప్రజాశక్తి - ఏలూరు

రాష్ట్ర ప్రభుత్వ వైఎస్‌ఆర్ పింఛను కానుక ఏప్రిల్‌లో చెల్లింపు మూడో తేదీ నుంచి ప్రారంభమవుతుందని డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాంకు ఆర్థిక సంవత్సరం ముగింపు, వరుస సెలవు దినాల కారణంగా పింఛను పంపిణీ ఏప్రిల్ మూడో తేదీ సోమవారం నుంచి ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలు తమ పరిధిలోని సచివాలయ సిబ్బంది, గ్రామ, వార్డు వాలంటీర్ల ద్వారా ముందుగా పింఛనుదారులకు తెలియజేయాలని కోరారు.

ఎంఎల్‌ఎ గారూ..
మా గోడు వినండి..!



దళితులు మా పార్టీకి వెన్నెముక అంటూ వైసిపి పదేపదే చెబుతోంది. అలాంటి దళితులకు కష్టం వస్తే మాత్రం ఆ పార్టీ ఎంఎల్‌ఎలకు పట్టకపోవడం ఆశ్చర్యం కల్గిస్తోంది. దెందులూరు మండలం దోసపాడులోని దళితులు తమ అసైన్డ్ భూముల కోసం ఏడాదికిపైగా పోరాటం చేస్తున్నప్పటికీ దెందులూరు ఎంఎల్‌ఎ కనీసం పట్టించుకోకపోవడం చర్చనీయాంశమైంది. కనీసం కలిసేందుకు ఎంఎల్‌ఎ అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడం బాధితులను తీవ్ర వేదనకు గురిచేస్తోంది. తమ భూములు తమకు ఇప్పించాలంటూ గత కొన్నిరోజులుగా బాధిత దళిత కుటుంబాలు గ్రామంలో నిరవధిక దీక్షలు చేస్తున్నాయి. ఎంఎల్‌ఎ గారూ.. ఇప్పటికైనా మా గోడు పట్టించుకోండంటూ వారంతా కోరుతున్నారు.

దెందులూరు మండలం దోసపాడు దళితుల ఆవేదన
ఏడాదిగా అసైన్డ్ భూముల కోసం పోరాడుతున్న పేదలు
కనీసం పట్టని దెందులూరు ఎంఎల్‌ఎ అబ్బాయిచౌదరి
ఓట్లకు మాత్రమే మేం పనికొస్తామా అంటూ దళితుల వేదన
రెండుసార్లు అపాయింట్‌మెంట్ అడిగినా ఇవ్వలేదని నిర్వేదం



దీక్షల్లో నినదిస్తున్న పేద దళితులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

దెందులూరు నియోజకవర్గంలోని దోసపాడు గ్రామంలోని దళిత కుటుంబాలు తమ అసైన్డ్ భూముల సమస్యపై ఏడాదిగా ఆందోళన చేస్తున్నా స్థానిక ఎంఎల్‌ఎ అబ్బాయిచౌదరికి పట్టకపోవడం తీవ్ర చర్చనీయాంశమైంది. తమ సమస్యను చెప్పుకోవాలని ఎంఎల్‌ఎను కలిసేందుకు ప్రయత్నించిన దళితులకు కనీసం అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వకపోవడం అందరినీ విస్మయపరుస్తోంది. పేదలకు అండగా నిలవాల్సిన ఎంఎల్‌ఎ తనకు ఏమాత్రం సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తున్న తీరు అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. దోసపాడులో దళితులకిచ్చిన అసైన్డ్ సీలింగ్ భూములు దాదాపు 350 ఎకరాల వరకు ఉన్నాయి. 1957 నుంచి దఫదఫాలుగా ఈ భూములను ప్రభుత్వం దళితులకు ఇచ్చినట్లు రికార్డులు చెబుతున్నాయి. సర్వే నెంబర్లు 208, 213, 214, 216, 225, 226, 227, 231, 232లో ఈ భూములున్నాయి. ప్రస్తుతం ఈ భూములన్నీ విజయవాడకు చెందిన దేవినేని బాజీప్రసాద్, ఆయన అనుచరుల చేతుల్లో ఉన్నాయి. ఈ భూములన్నీ ప్రస్తుతం చేపలు, రొయ్యల చెరువులుగా మారిపోయాయి. అప్పట్లో తమను ప్రలోభపెట్టి ఈ భూములను కాజేశారని భూములకు సంబంధించిన దళితులు చెబుతున్నారు. నిబంధనల ప్రకారం అసైన్డ్, సీలింగ్ భూములకు సంబంధించి క్రయవిక్రయాలు నిషిద్ధం. తమ భూములు తమకు అప్పగించాలని ఏడాదిగా దాదాపు 50కి పైగా దళిత కుటుంబాలు పోరాటం చేస్తున్నాయి. కలెక్టరేట్ వద్ద ఆందోళనలు, పాదయాత్రలు, అధికారులకు వినతిపత్రాలు ఇలా అనేక రూపాల్లో తమ నిరసన తెలుపుతున్నారు. సమస్యను పరిష్కరించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో తమ సమస్యను పరిష్కరించాలని గడిచిన వారంరోజులుగా గ్రామంలోని సచివాలయం వద్ద బాధిత దళితులంతా నిరవధిక దీక్షలు చేస్తున్నారు.

నియోజకవర్గ ప్రజల సమస్య ఎంఎల్‌ఎకు పట్టదా..?

నియోజకవర్గ పరిధిలోని ప్రజలు ఏడాదిగా రోడ్డెక్కి ఓ సమస్యపై పోరాటం చేస్తున్నా స్థానిక ఎంఎల్‌ఎ ఎందుకు పట్టడం లేదో ఏఒక్కరికీ అర్థం కావడం లేదు. కనీసం సమస్య ఏమిటంటూ అడిగిన దాఖలాలు లేకుండాపోయాయి. ఏడాదిగా పోలీసులు బాధిత దళితులపై తీవ్ర నిర్బంధం ప్రయోగిస్తున్నారు. తమ గోడు ఎంఎల్‌ఎకు చెప్పుకుందామని ఆయనను కలిసేందుకు ప్రయత్నించిన బాధిత దళితులకు ఆయన అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వడం లేదని తెలిసింది. ఈ నెల 25న దెందులూరులో సిఎం పర్యటన సాగింది. తమ సమస్యను సిఎంకు చెప్పుకునేందుకు అవకాశం కల్పించాలని ఎంఎల్‌ఎను అడిగేందుకు ప్రయత్నించినా ఫలించలేదని తెలిసింది. దళితులు ఓట్లు వేసేందుకు మాత్రమే పనికొస్తారా అంటూ బాధితుల ప్రశ్నలకు ప్రజాప్రతినిధులు సమాధానం చెప్పాల్సి ఉంది. 2015లో లోకాయుక్త కోర్టు కూడా ఈ భూములను దళితులకు అప్పగించాలని తీర్పు ఇచ్చింది. అయినప్పటికీ పేదలైన దళితులకు న్యాయం జరగని పరిస్థితి నెలకొంది. దేవినేని బాజీప్రసాద్ కుటుంబం వైసిపిలో ఉండటం కారణంగానే ఎంఎల్‌ఎ తమను పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామం మీదుగా ఎంఎల్‌ఎ అటువైపుగా వెళ్తూ తమను పట్టించుకోవడం లేదని దళితులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. గత టిడిపి ప్రభుత్వంలోనూ ఇదే నియోజకవర్గంలో దళితులు అనేక సమస్యలపై రోడ్డెక్కిన పరిస్థితి నెలకొంది. అప్పటి ఎంఎల్‌ఎ నిర్లక్ష్యంగా వ్యవహరించిన పరిస్థితి కొనసాగింది. ఇప్పుడు అదే పరిస్థితి నెలకొనడంపై సర్వత్రా చర్చ సాగుతోంది. ప్రతిపక్షంలో ఉండగా ఒకలా, అధికారంలోకొచ్చాక మరోలా వ్యవహరిస్తున్న ప్రజాప్రతినిధుల తీరు అందరినీ నివ్వెరపరుస్తోంది.

కొనసాగిన దోసపాడు దళితుల దీక్షలు

ప్రజాశక్తి - దెందులూరు

పేదలకు చెందిన అసైన్డ్, సీలింగ్, గయాళ భూముల కోసం 10 నెలలు నుండి పోరాడుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ విమర్శించారు. గురువారం గ్రామ సచివాలయ కార్యాలయం వద్ద పేదల రిలే దీక్షలు ఏడో రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ అసైన్డ్ భూములు ఆక్రమించుకున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోకుండా పేదలపై దాడులకు దిగడం దారుణమన్నారు. పేదల భూముల విషయంపై వారం రోజుల్లో రాతపూర్వక హామీ ఇవ్వని పక్షంలో మరోమారు భూముల్లోకి వెళ్తామని హెచ్చరించారు. చెరువులకు గండికొట్టి భూమిని స్వాధీనం చేసుకుంటామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భూపోరాట నాయకులు ఆనందరావు, మణి, కుమారి, గంగాధర్, వెంకటరమణ, లలిత, వినోద్, నాగేంద్ర పాల్గొన్నారు.

జెసి కోర్టులో దోసపాడు వివాదం: దెందులూరు తహశీల్దార్

ప్రజాశక్తి - ఏలూరు

దోసపాడు భూముల వివాదం ప్రస్తుతం జాయింట్ కలెక్టర్ కోర్టులో ఉందని దెందులూరు తహశీల్దార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29న 'ప్రజాశక్తి'లో 'దోసపాడు దళితుల పట్ల నిర్లక్ష్యం తగదు' శీర్షికన ప్రచురితమైన వార్తపై ఆయన స్పందించారు. దెందులూరు మండలం దోసపాడులో పేదలు గత 10 నెలల నుండి అసైన్డ్, సీలింగ్, గయాళ్ల భూములను పంచాలని పోరాడుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని, 25 ఏళ్ల నుండి పేదల భూములను ఆక్రమించుకొని అనుభవిస్తున్న వారిపై ఇప్పటి వరకు చర్య తీసుకోలేదని, ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ యాక్టు కింద నిందితులను అరెస్ట్ చేయాలని కోరుతు దోసపాడులో సుమారు 20 మంది రిలే నిరాహారదీక్షలు చేస్తున్నారని పేర్కొన్నారు. దోసపాడు 105 ఎకరాల గయాళ్ల భూమిని కొంతమందికి అసైన్డ్ పట్టాలు ఆ కాలంలో ఇచ్చారని, తర్వాత అనేక అమ్మకాలు, కొనుగోళ్లు జరిగాయని తెలిపారు. దీనిపై నోటీసులు జారీచేసి 2012-14 మధ్య కాలంలో సదరు భూములను స్వాధీనపర్చుకోవడానికి అప్పటి తహశీల్దార్ ఉత్తర్వులు జారీ చేయగా ఆర్‌డిఒ కోర్టులో కొందరు అప్పీల్ చేశారని, దీనిపై తహశీల్దార్ ఉత్తర్వులనే ధ్రువపరుస్తూ ఉత్తర్వులివ్వగా కొనుగోలుదారులు హైకోర్టులో కేసు వేశారని పేర్కొన్నారు. సదరు కేసును జాయింట్ కలెక్టర్ కోర్టుకు తదుపరి చర్య నిమిత్తం రిమాండ్ చేశామని తెలిపారు. ప్రస్తుతం అది జెసి కోర్టులో ఉందని పేర్కొన్నారు. దీనిపై 2022 సెప్టెంబర్ మూడో తేదీన గ్రామంలో సమావేశం నిర్వహించి ఆందోళన చేస్తున్నవారిని వారి వద్ద ఉన్న ఆధారాలు చూపాలని కోరామని, తర్వాత మండల కార్యాలయంలో సమావేశాలు నిర్వహించి ప్రభుత్వం మంజూరు చేసిన పట్టాలను, పట్టాదారులు మరణిస్తే వారి వారసులు కుటుంబ సభ్యుల ధ్రువపత్రాలు అందజేయాలని కోరామని, దీనికి సంబంధించి గ్రామ రెవెన్యూ అధికారులకు ఆదేశాలిచ్చామని తెలిపారు. అయితే ఇప్పటి వరకూ ఎటువంటి రికార్డులు సమర్పించకుండా ధర్నాలు చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ కేసు కోర్టులో ఉందని తెలిపారు.



నిలిచిపోయిన ట్రైన్



రైలు తాకిడికి తునాతునకలైన బొలేరో వాహనం శకలాలు

'దురంతో'కు తప్పిన ముప్పు


భీమడోలులో పట్టాలపై నిలిచిన బొలేరోను ఢీకొన్న రైలు
తునాతునకలైన బొలేరో వాహనం
ఇంజిన్ ముందు భాగం దెబ్బతిని 5 గంటలు నిలిచిన రైలు
పోలీసులు వెంబడిస్తున్న బొలేరో ఇదేనని అనుమానాలు

ప్రజాశక్తి - భీమడోలు/ఉంగుటూరు

భీమడోలు రైల్వే గేటు వద్ద పట్టాలపై నిలిచిన బొలెరో వాహనాన్ని సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్తున్న దురంతో ఎక్స్‌ప్రెస్ ఢీకొన్న ఘటన గురువారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్తున్న దురంతో ఎక్స్‌ప్రెస్ గురువారం తెల్లవారుజామున సుమారు 2.14 గంటలకు భీమడోలు రైల్వే స్టేషన్ మీదుగా వెళ్లనున్న నేపథ్యంలో తాడేపల్లిగూడెం జాతీయరహదారి నుంచి భీమడోలు జంక్షన్‌కు వెళ్లే మార్గంలోని రైల్వేగేటు వేశారు. సరిగ్గా అదే సమయంలో 216వ జాతీయరహదారిపై నుంచి బొలెరో వాహనం అతివేగంగా గేటును ఢీకొట్టి పట్టాలపైకి వెళ్లి ఆగిపోయింది. సరిగ్గా అదే సమయంలో దురంతో ఎక్స్‌ప్రెస్ రావడంతో బొలెరోలోని వారంతా వాహనం దిగి అక్కడి నుంచి పరారయ్యారు. ఈ క్రమంలో వేగంగా వస్తున్న రైలు తాకిడికి బొలెరో తునాతునకలైంది. దీంతో రైలు ఇంజిన్ ముందు భాగం దెబ్బతినడంతో రైలు అక్కడే నిలిచిపోయింది. రైలులోని ప్రయాణికులంతా క్షేమంగా బయటపడ్డారు. దెబ్బతిన్న రైలు ఇంజిన్‌ను బోగీల నుంచి తొలగించి వేరే ఇంజిన్ అమర్చి ఉదయం 8.48 నిమిషాలకు రైలును విశాఖపట్నం పంపారు. సుమారు ఆరున్నర గంటలసేపు రైలు నిలిచిపోవడంతో దానిలోని ప్రయాణికులు పలువురు జాతీయ రహదారిపైకి చేరుకుని ప్రత్యామ్నాయ మార్గాల్లో గమ్యస్థానాలకు వెళ్లిపోయారు. సంఘటనా సమాచారం తెలుసుకున్న వెంటనే రైల్వే అధికారులు హుటాహుటిన అక్కడికి చేరుకుని పరిస్థితిని పర్యవేక్షించారు.

పోలీసులు వెంబడించడంతో..!

జాతీయ రహదారిపై ఏలూరు నుంచి తాడేపల్లిగూడెం వైపు వస్తున్న బొలెరో వాహనాన్ని అనుమానంతో హైవే పెట్రోలింగ్ సిబ్బంది ఇచ్చిన సమాచారంతో పోలీసులు వెంబడించినట్లు తెలుస్తోంది. దీంతో బొలెరోలోని వారు భయంతో తప్పించుకునే క్రమంలో గేటును ఢీకొట్టినట్లు అనుమానిస్తున్నారు. సంఘటనా స్థలంలో లభ్యమైనా ఆధారాలతో రైల్వేపోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



నారాయణస్వామి భౌతికకాయంపై టిడిపి జెండా కప్పి నివాళులర్పిస్తున్న పుల్లారావు, తోట సీతారామలక్ష్మి, ఎంఎల్‌ఎ రామరాజు

యర్రాకు కన్నీటి వీడ్కోలు
ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు

ప్రజాశక్తి - ఉండి



నివాళులర్పిస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ

జిల్లాలో విభిన్న రంగాల్లో తనదైన శైలిలో గొప్పముద్ర వేసిన మాజీ మంత్రి యర్రా నారాయణస్వామి అంత్యక్రియలను గురువారం ఆయన స్వగ్రామం ఉండి మండలం ఉప్పులూరులో అధికారిక లాంఛనాలతో నిర్వహించారు. తొలుత ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ హాజరై యర్రా నారాయణస్వామికి నివాళులర్పించారు. అనంతరం కొట్టు మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా నారాయణస్వామి ప్రతిఒక్కరితో ఎంతో ఆప్యాయంగా మెలిగేవారన్నారు. తన రాజకీయ జీవితంలో ప్రతిపక్షాలతో హుందాగా ప్రవర్తించేవారని, అటువంటి వ్యక్తి మరణం తీరనిలోటు అని అన్నారు. ఆయన కుమారులు నవీన్, సూర్యచంద్రరావుకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. భీమవరం ఆర్‌డిఒ దాసి రాజు ఆధ్వర్యంలో నారాయణస్వామి భౌతికకాయంపై జాతీయ జెండాను ఉంచి ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. డిఎస్‌పి ఎంవివి.సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎఆర్ బెటాలియన్ గాల్లోకి మూడు రౌండ్లు కాల్చి గౌరవ వందనం సమర్పించారు. రాష్ట్ర, జిల్లా నలుమూలల నుంచి వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున తరలొచ్చి తమ అభిమాన నేతకు కడసారి వీడ్కోలు పలికారు.

నారాయణస్వామి పేరిట రైతు సంక్షేమ పథకం
టిడిపి నేతలు వెల్లడి

తాము అధికారంలోకొచ్చాక రైతులకు అందించే సంక్షేమ పథకాల్లో ఒక దానికి మాజీ మంత్రి యర్రా నారాయణస్వామి పేరు పెడతామని మాజీ మంత్రులు ప్రత్తిపాటి పుల్లారావు, నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. గురువారం ఉప్పులూరులో యర్రా నారాయణస్వామి భౌతికకాయంపై టిడిపి జెండా కప్పి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పుల్లారావు, చినరాజప్పతోపాటు టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి, ఉండి ఎంఎల్‌ఎ మంతెన రామరాజు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి నారాయణస్వామి అందించిన సేవలు ఎనలేనివన్నారు. 2024లో తమ ప్రభుత్వం ఏర్పడుతుందని, రైతాంగానికి మేలు చేకూర్చే ఒక పథకానికి నారాయణస్వామి పేరు పెడతామని పార్టీ అధినేత చంద్రబాబు చెప్పమన్నారని తెలిపారు.

నివాళులర్పించిన సిపిఎం నేతలు

మాజీ మంత్రి యర్రా నారాయణస్వామి భౌతికకాయాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, నేతలు చింతకాయల బాబూరావు, జెఎన్‌వి.గోపాలన్, రంగారావు సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ నారాయణస్వామి పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరితో ఎంతో ఆప్యాయంగా మెలిగే వారన్నారు.

పలువురు ప్రముఖుల సంతాపం

నారాయణస్వామికి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించిన వారిలో డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు, మాజీ ఎంఎల్‌ఎలు వి.శివరామరాజు, చింతమనేని ప్రభాకర్, ఎంఎల్‌ఎలు నిమ్మల రామానాయుడు, పుప్పాల వాసుబాబు, ఎంఎల్‌సి వంక రవీంద్రనాథ్, మాజీ మంత్రి, కాపు సంక్షేమసేన వ్యవస్థాపకులు చేగొండి హరిరామజోగయ్య, జనసేన జిల్లా అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావు, ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు, టిడిపి సీనియర్ నేత మెంటే పార్థసారథి, పాతపాటి వాసు, అధికారులు, నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో సందర్శించి నివాళులర్పించారు.

యర్రా మృతి రైతాంగానికి తీరని లోటు
రైతు కార్యాచరణ సమితి నేత మంతెన రవివర్మ

మాజీ మంత్రి యర్రా నారాయణస్వామి మృతి రైతాంగానికి తీరని లోటని రైతు కార్యాచరణ సమితి నేత మంతెన రవివర్మ అన్నారు. నారాయణస్వామి భౌతికకాయానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవివర్మ మాట్లాడుతూ జమిందారీ కుటుంబంలో జన్మించిన నారాయణస్వామి అన్నదాతల సంక్షేమానికి అలుపెరుగని కృషి చేశారన్నారు. తాడిపూడి ఎత్తిపోతల పథకం, కొవ్వాడ రిజర్వాయర్ నిర్మాణంలో కీలకపాత్ర పోషించారన్నారు. ఆయన వెంట నేతలు అడ్డాల వాసుదేవరావు, తమ్మినీడి నాగేశ్వరరావు, గోపిశెట్టి మురళీకృష్ణారావు ఉన్నారు.

ఘోరం..!

మోటారు సైకిల్‌ను ఢీకొన్న లారీ
భార్యాభర్త, మేనల్లుడు దుర్మరణం



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రవి, బెంజిమెన్



రవి, ఉష దంపతులు (ఫైల్‌ఫొటో)



బెంజిమెన్ (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

లారీ మోటారు సైకిల్‌ను ఢీకొన్న ప్రమాదలో ముగ్గురు దుర్మరణం పాలైన ఘటన గురువారం మధ్యాహ్నం తల్లాడ-దేవరపల్లి జాతీయ రహదారిపై జంగారెడ్డిగూడెం శివార్లలో సబ్‌స్టేషన్ వద్ద చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రం సత్తుపల్లి మండలం కృష్ణారం గ్రామానికి చెందిన నక్క రవి (30), ఉష (27) దంపతులు తూర్పుగోదావరి జిల్లా గోకవరంలో ఉంటున్న రవి సోదరి వేల్పుల కళావతి ఇంటికి రెండు రోజుల క్రితం వెళ్లారు. వీరు గురువారం గోకవరం నుండి సత్తుపల్లి తిరుగు ప్రయాణమయ్యారు. రవి, ఉష దంపతులు ద్విచక్రవాహనంపై బయల్దేరగా, సోదరి వేల్పుల కళావతి, అనంతకుమార్ దంపతులు, వారి ఇద్దరు కుమారులు జోసఫ్ బెంజిమెన్ (12), జాయ్‌బాబు బస్సులో బయల్దేరారు. వీరు జంగారెడ్డిగూడెం బస్టాండ్‌కు వచ్చేసరికి అనంతకుమార్ పెద్దకుమారుడు జోసఫ్ బెంజిమెన్ తన మేనమామ రవితో కలిసి మోటారు సైకిల్‌పై వస్తానని మారం చేశాడు. దీంతో రవి, ఉష దంపతులతోపాటు బెంజ్‌మెన్‌ను తమ మోటారుసైకిల్‌పై ఎక్కించుకుని బయల్దేరారు. వీరు ప్రయాణిస్తున్న మోటారు సైకిల్ జంగారెడ్డిగూడెం శివారు జాతీయ రహదారిపై విద్యుత్ సబ్‌స్టేషన్ వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న లారీని మరో లారీ ఓవర్‌టేక్ చేయబోతూ వీరి మీదకు దూసుకొచ్చింది. ఈ ప్రమాదంలో వాహనంపై నుంచి ఎగిరిపడ్డ రవి, జోసఫ్ బెంజిమెన్ తలకు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్ర గాయాల పాలైన ఉషను స్థానికులు హుటాహుటీన 108 వాహనంపై జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆమె చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం రాత్రి మృతి చెందింది. ఈ ప్రమాదం జరిగిన కొద్దిసేపటికే వెనుక బస్సులో వస్తున్న బెంజిమెన్ తల్లిదండ్రులు రోడ్డు ప్రమాదంలో తమ కుమారుడు, రవి మృతి చెందారని తీవ్ర షాక్‌కు గురయ్యారు. బెంజిమెన్ తల్లి కళావతి మతిస్థిమితం కోల్పోయి 'నా కొడుకు బెంజిమెన్ స్కూల్‌కు వెళ్లాలి.. ఆడుకునే టైమ్ అయ్యింది' అంటూ మాట్లాడటం అందరినీ కలిచి వేసింది. ఆమె ఆర్తనాదాలు విని అక్కడున్న వారంతా కంటతడి పెట్టారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యలు చర్చించరు..
ప్రజాప్రతినిధులను గౌరవించరు

నగరపాలక సంస్థ సమావేశాల తీరుపై సిపిఎం విమర్శ

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరు నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశాల్లో ప్రజాసమస్యలపై చర్చించరా, తోటి ప్రజాప్రతినిధులను గౌరవించరా అని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిధులు కేటాయించి పని చేయాలని, అలాంటి బడ్జెట్ సమావేశాల్లో ప్రజా సమస్యలపై చర్చించకూడదని చెప్పడం తగదని పేర్కొన్నారు. ఎక్స్‌అఫిషియో సభ్యుని హోదాలో సమావేశానికి వచ్చి ప్రజా సమస్యలపై మాట్లాడుతున్న ఎంఎల్‌సి సాబ్జీని మేయర్ నూర్జహాన్ 'ఇక చాల్లే మాట్లాడింది.. కూర్చోండి' అని అనడం వైసిపి దురహంకారానికి నిదర్శనమని విమర్శించారు. వైసిపి ప్రభుత్వంపై వ్యతిరేకత లేదని, సమస్యలు లేవని చెప్పి తోటి ప్రజాప్రతినిధులను మాట్లాడనీయకుండా అగౌరపర్చడం గర్హనీయమని పేర్కొన్నారు. డిప్యూటీ మేయర్ గుడిదేశి శ్రీనివాసరావు భావిస్తున్నట్లు వైసిపి ప్రభుత్వంపై వ్యతిరేకత లేకపోతే గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల్లో ఎందుకు ఓడిపోయారని, సొంత ఎంఎల్‌ఎలే ముఖ్యమంత్రిని ధిక్కరించి వ్యతిరేకంగా ఓటు ఎందుకు వేశారని ప్రశ్నించారు. అధికారం ఉందని ఏది చెబితే అది చెల్లుతుందని, ఏం చేస్తే అది జరుగుతుందని భావించడం వైసిపి పతనానికి దారితీస్తోందని హెచ్చరించారు. బడ్జెట్ సమావేశాన్ని గంటలోపే ముగించేశారంటే ఏస్థాయిలో ఏకపక్ష ధోరణి ప్రదర్శించారో అర్థమవుతుందని తెలిపారు. ఎంఎల్‌సి సాబ్జీ ప్రస్తావించిన ప్రజా సమస్యలను పరిష్కరించాలని, సర్వసభ్య సమావేశంలో ప్రజా సమస్యలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

వ్యవసాయ చట్టాలు పకడ్బందీగా అమలు చేయాలి

ఎంఎల్‌సి షేక్ సాబ్జీ

ప్రజాశక్తి - ఏలూరు



ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న సాబ్జీ, వ్యకాస నేతలు

వ్యవసాయ రంగా భివృద్ధి వ్యవసాయ కార్మికుల అభివృద్ధితో ముడిపడి ఉందని ఎంఎల్‌సి షేక్ సాబ్జీ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ కార్మికుల సంక్షేమం కోసం ఉన్న చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం 29వ మహాసభ గత డిసెంబర్‌లో జంగారెడ్డిగూడెంలో నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మికుల స్థితిగతులు, మహాసభ పిలుపులు తదితర అంశాలతో ప్రచురించిన సావనీర్‌ను స్థానిక అన్నే భవనంలో ఎంఎల్‌సి షేక్ సాబ్జీ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 65 శాతం ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. ధాన్యాగారంగా పేరొందిన గోదావరి జిల్లాల్లో వ్యవసాయ కార్మికులు రోజురోజుకీ పెరుగుతున్నారని తెలిపారు. వ్యవసాయ కూలీలకు వేతనాలు పెంచాలని దశాబ్దాలుగా వ్యవసాయ కార్మిక సంఘం పోరాడి కనీస వేతనాలను సాధించిందన్నారు. వ్యవసాయ రంగంలో యాంత్రీకరణ పెరగడంతో పనులు తగ్గడంతో కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉపాధి హామీ పనులకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిధులు తగ్గించడంతోపాటు కనీస పని దినాలు కల్పించకపోవడం దుర్మార్గమన్నారు. యంత్రాలతో పని చేయించడం వల్ల కాంట్రాక్టర్ జేబులు నింపడం తప్ప ఉపాధి కూలీలకు కనీస వేతనాలు అందడం లేదని మండిపడ్డారు. వ్యవసాయ కార్మికుల ప్రయోజనాలు, సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పని చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.రవి మాట్లాడారు. వ్యవసాయ కార్మికుల అభివృద్ధి, సంక్షేమం కోసం రాబోయే కాలంలో ఆందోళన, పోరాటాలు ఉధృతం చేస్తామన్నారు. దీనిలో భాగంగా ఏప్రిల్ 5న చేపట్టిన చలో ఢిల్లీలో కార్మికులు, వ్యవసాయ కార్మికులు, రైతులు, కౌలు రైతులు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం, కార్యదర్శి పి.రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.మహంకాళిరావు, నేతలు మావూరి శ్రీనివాస్, జె.మహేష్, పి.ఆనందరావు, సునీల్, నాగేంద్ర, జాన్‌రాజు పాల్గొన్నారు.

మాజీ మంత్రి యర్రా మృతి తీరని లోటు

సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు దేగా ప్రభాకర్

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

మాజీ మంత్రి, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్, రాజ్యసభ మాజీ సభ్యులు యర్రా నారాయణస్వామి మృతి జిల్లా రాజకీయాలకు, ప్రజలకు తీరని లోటని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు దేగా ప్రభాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నారాయణస్వామి నీతికి నిలువుటద్దం, అజాతశత్రువు అని కొనియాడారు. అనేక పదవులు నిర్వహించినా ప్రజలతో మమేకమై ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేసిన మహోన్నత వ్యక్తి యర్రా నారాయణస్వామి అని కొనియాడారు. ఆయన నిరాడంబరత, నిబద్ధత వెలకట్టలేనివని తెలిపారు. జిల్లా సమగ్రాభివృద్ధికి విశేష కృషి చేసిన మహోన్నత వ్యక్తిగా గుర్తింపు పొందారని గుర్తు చేసుకున్నారు. యువత, నేటి తరం నాయకులు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. యర్రా నారాయణస్వామి మృతి పట్ల ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఉపాధి హామీలో ఆల్‌టైమ్ రికార్డు

జిల్లాలో 15 ఏళ్ల చరిత్రలో ఈ ఏడాది అత్యధిక పని దినాలు

డ్వామా పీడీ రాంబాబు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

జిల్లా చరిత్రలో కనీవినీ ఎరుగని విధంగా 2022-23 ఆర్థిక సంవత్సరంలో అత్యధిక పని దినాలు కల్పించి చరిత్ర సృష్టించినట్లు జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ డుండి రాంబాబు తెలిపారు. జిల్లాలో నిర్దేశిత పని దినాల లక్ష్యం 1.42 లక్షలు కాగా, 1.44 లక్షల పనిదినాలు మార్చి 28 వరకు కల్పించినట్లు చెప్పారు. 3.71 లక్షల కుటుంబాలకు చెందిన 6.65 లక్షల మంది వేతనదారులకు ఉపాధి కల్పించామన్నారు. రూ.303.85 కోట్ల వేతనాలు చెల్లించామన్నారు. రూ.106.13 కోట్ల మెటీరియల్ చెల్లింపులు చేశామన్నారు. కలెక్టర్ ప్రసన్నవెంకటేష్, వారి సారథ్యంలో జాయింట్ కలెక్టర్ పి.అరుణ్‌బాబు వారి మార్గదర్శకత్వంలో ఇతర డివిజనల్, మండల స్థాయి అధికారుల సహకారంతో ఈ అపూర్వ ఘట్టం ఆవిష్కృతమైందని చెప్పారు. మండలస్థాయిలో ఎంపిడిఒ విశిష్ట నాయకత్వం, ఎపిడిలు, ఎపిఒలు, ఇంజినీరింగ్ కన్సల్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, బేర్ ఫుట్ టెక్నీషియన్లు, ప్లాంటేషన్ సిబ్బంది, క్లస్టర్ ఆఫీస్, ఎంటిలు, అన్నిటికి మించి ఫీల్డ్ అసిస్టెంట్ల నిర్విరామ కృషి వల్ల ఇంతటి ఘనమైన విజయాన్ని సాధించగలిగామన్నారు. ఈ విజయంలో భాగస్వాములైన ప్రజా ప్రతినిధులకు, మీడియా ప్రతినిధులకు డ్వామా పీడీ డి.రాంబాబు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. క్షేత్రస్థాయిలో సాధించిన ఘనతను ఎప్పటికప్పుడు పర్యవేక్షణ, మూల్యాంకనం చేయడంలో తోడ్పడిన డ్వామా కార్యాలయ సిబ్బందిని కూడా ఆయన అభినందనలు తెలిపారు.

1న విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని జనజంబు స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏప్రిల్ ఒకటో తేదీ శుక్రవారం ఆగిరిపల్లి మండల పరిధిలోని ప్రాథమికోన్నత పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు డాక్టర్ బిఆర్ అంబేద్కర్-భారత రాజ్యాంగ రచన అంశంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నట్లు సంస్థ సంచాలకర్త కంబాల ప్రదీప్ తెలిపారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఏప్రిల్ 14 అంబేద్కర్ జయంతి సందర్భంగా బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

పలుచోట్ల అన్నసమారాధన

ప్రజాశక్తి - పోలవరం

శ్రీరామనవమి సందర్భంగా మండలంలోని పలుచోట్ల అన్నసమారాధన నిర్వహించారు. సర్వ మానవాళికి శ్రీరాముడు ఆదర్శనీయుడు, మార్గదర్శకుడని డిఎస్‌పి కె.లతాకుమారి అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఉన్న ఆంజనేయ స్వామి ఆలయం వద్ద గురువారం శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కళ్యాణం నిర్వహించారు. ఈ సీతారాముల కళ్యాణంలో సిఐ.విజయ్‌బాబు, ఎస్ఐ పవన్ కుమార్, డిఎస్‌పి దంపతులు పీటలపై కూర్చుని సీతారాముల కళ్యాణం నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ. పలు గ్రామాల్లోని రామాలయాల్లో సీతారాముల కళ్యాణం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

మండవల్లి : మండవల్లి ప్రధాన సెంటర్లో ఆంజనేయస్వామి ఆలయంలో, వేలంపేటలో, స్టేషన్ రోడ్డులో ఉన్న కోదండ రామాలయంలో సీతారాముల వారి కళ్యాణ మహోత్సవాన్ని కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. కోదండరామ మందిరంలో నిర్వహించిన వేడుకలో బట్రాజు చాణిక్య అనూష సుంకర రంగారావు దంపతులు పీటల మీద కూర్చున్నారు. ఈ వేడుక ప్రసాదాలతో పాటు పానకాన్ని పంపిణీ చేశారు. సీతారాములతో గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఏప్రిల్ మూడో తేదీన సోమవారం సాయంత్రం రెండు వేల మందికి అన్నదానం చేయనున్నట్లు తెలిపారు.

ఆగిరిపల్లి : శ్రీరామనవమి వేడుకలను గురువారం మండల కేంద్రమైన ఆగిరిపల్లితో సహా పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ఆగిరిపల్లిలోని పొగడచెట్ల మండపం వద్ద, గౌడబజారులోని రామాలయం వద్ద, సీతారాముల కళ్యాణ వేడుకలను ఘనంగా నిర్వహించి అన్నదానం నిర్వహించారు.

చాట్రాయి : శ్రీరామనవమి సందర్భంగా మండలంలోని చనుబండ గ్రామంలోని కోదండ సీతారామస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురాతన చరిత్ర కలిగిన చనుబండ సీతారామస్వామి ఆలయానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి వందలాది భక్తులు భక్తిశ్రద్ధలతో హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. బూరుగుగూడెం గ్రామంలోని సీతా రామాంజనేయ స్వామి ఆలయంలో రాష్ట్ర కో-ఆపరేటివ్ యూనియన్ చైర్మన్ రాఘవరెడ్డి దంపతులు పూజలు నిర్వహించారు. చాట్రాయిలోని రామాలయంలో ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో ఘనంగా పూజలు నిర్వహించి అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

కైకలూరు : మండలంలోని పలు గ్రామాల్లో గురువారం శ్రీ రామనవమి సందర్భంగా సీతారాముల కళ్యాణ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు, ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణ పలు గ్రామాల్లో వేడుకల్లో పాల్గొన్నారు.

నవమి వేడుకల్లో ఇరు గ్రూపుల మధ్య ఘర్షణ

నూజివీడు రూరల్ : మండలంలోని జంగంగూడెం గ్రామంలో నవమి వేడుకల్లో ఇరు గ్రూపులవారు ఘర్షణ పడ్డారు. శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా స్వామివారి కళ్యాణం నిర్వహించేందుకు రెండు గ్రూపులవారు ఒక స్థలంలో ఒక గ్రూపు టెంట్లు వేశారు. మరొక గ్రూపు వారు ఆ టెంట్లను తొలగించడంతో ఘర్షణ చోటు చేసుకుంది. ఈ ఘటనలో పోలీసులు రంగ ప్రవేశం చేశారు. సిఐ ఆర్.అంకబాబు ఆదేశాల మేరకు రూరల్ ఎస్‌ఐ రామకృష్ణ ఇరుగ్రూపుల వారిని స్టేషన్‌కు తరలించారు.

బాధిత కుటుంబానికి సాయం

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లి అంబేద్కర్‌నగర్‌కు చెందిన దుబా సుమన్ ఇటీవల పాము కాటుకు గురై మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న టిడిపి కైకలూరు నియోజకవర్గ యువనేత కొవాలి వినోద్ సుమన్ కుటుంబసభ్యులను గురువారం పరామర్శించారు. రూ.15 వేలు ఆర్థిక సాయం మృతుని కుటుంబ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ కుటుంబానికి టిడిపి తరపున తామెప్పుడు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పంతగాని సురేష్, మరిపి పార్థసారథి, అంబేద్కర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

గంగినీడుపాలేనికి తాగునీటి ట్యాంకర్

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని గంగినీడుపాలెం గ్రామానికి చెందిన జనసేన ఎన్ఆర్ఐ (అమెరికా) సత్య వెజ్జు రూ.2.70 లక్షల ఆర్థిక సాయంతో ఆయన తల్లిదండ్రులు వెజ్జు గోపాలరావు, సరస్వతి దంపతుల పేరుతో వాటర్ ట్యాంకర్‌ను జనసేన పార్టీ పోలవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ చిర్రి బాలరాజు చేతులమీదుగా గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ గ్రామ ప్రజల అవసరాల మేరకు తాగునీటి ట్యాంకర్ బహుకరించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి కరాటం సాయి, కార్యదర్శులు గెడ్డమనుగు రవికుమార్, తుట్టి రామచంద్రం, మండల అధ్యక్షులు అడపా నాగరాజు, చిన్నపొన్నారావు, జట్ల సత్యనారాయణ, ఆళ్ళ బాలాజీ పాల్గొన్నారు.

పిఎం జీవనజ్యోతి బీమా అందజేత

కుక్కునూరు : అనారోగ్యంతో మృతి చెందిన మండలంలోని అమరవరం గ్రామానికి చెందిన సోయం పాపారావు భార్య కళావతికి గురువారం ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా రూ.2 లక్షల చెక్కును ఎపిజివి బ్యాంకు మేనేజర్ దినేష్‌కుమార్ అందించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ ప్రతి ఖాతాదారుడు ప్రధానమంత్రి సురక్షా బీమా చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎపి జివి బ్యాంక్ అసిస్టెంట్ పవన్‌కుమార్, బ్యాంక్ మిత్ర రత్నకుమారి పాల్గొన్నారు.

పది పరీక్షలకు విద్యార్థులు సిద్ధం

ఉత్తమ ఉత్తీర్ణతకు కృషి



భద్రయ్య, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం, చాట్రాయి

చాట్రాయి : విద్యార్థులకు సిలబస్ మొత్తం బోధించామని, విద్యాబోధనలో ఎటువంటి లోపం లేదని చాట్రాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు భద్రయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు 53 మంది ఉన్నారన్నారు. విద్యార్థులందరూ పరీక్షలు రాయటానికి పట్టుదలతో సిద్ధంగా ఉన్నారని చెప్పారు. పదో తరగతి పరీక్షలు ఏప్రిల్ మూడో తేదీ నుంచి 15వ తేదీ వరకు జరుగుతాయన్నారు. మంచి ఉత్తీర్ణ శాతాన్ని పాఠశాలకు అందించేందుకు, విద్యార్థులందరూ పాస్ అవ్వటానికి ఉపాధ్యాయులు ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. పాఠశాలకు పదో తరగతి విద్యార్థులు మంచి పేరు తీసుకొస్తారన్నారు. చాట్రాయిలోని పాఠశాలను పరీక్ష కేంద్రంగా కేటాయించారని చెప్పారు. చాట్రాయిలోని పాఠశాలలో చిత్తపూరు, పోలవరం, చనుబండ, చిన్నంపేట, సి.గుడిపాడు పాఠశాలల పదో తరగతి విద్యార్థులు 284 మంది పరీక్షలు రాస్తారని, మర్లపాలెం పాఠశాల విద్యార్థులు చెక్కపల్లి పాఠశాలలో పరీక్షలు రాస్తారని, తమ పాఠశాలలోని 53 మంది విద్యార్థులు చాట్రాయిలోని ఆర్‌సిఎం పాఠశాలలో పరీక్షలు రాస్తారని తెలిపారు. విద్యార్థులు మాట్లాడుతూ అన్ని సబ్జెక్టులకు ఉపాధ్యాయులు ఉన్నారని, మాకుఅర్థమయ్యేవిధంగా బోధిస్తారని, ఎలాంటి ఇబ్బందులు లేవని, మధ్యాహ్న భోజనం ఉపాధ్యాయులతో కలిసి చేస్తామని, ఉపాధ్యాయులు మమ్మల్ని తమ సొంత బిడ్డలుగా చూసుకుంటున్నారని చెప్పారు. పదో తరగతి పరీక్షలు రాయటానికి తామంతా సిద్ధంగా ఉన్నామని, పాఠశాలకు, ఉపాధ్యాయులకు, మా తల్లిదండ్రులకు మంచి పేరు తెచ్చేవిధంగా మంచి మార్కులతో పాస్ అవుతామని ట్రిపుల్ ఐటిలో సీట్లు సాధిస్తామని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

పారదర్శకంగా పది పరీక్షలు



సాంబశివరావు, భీమడోలు విద్య శాఖాధికారి

భీమడోలు : మండలంలోని ఆరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, పొలసానిపల్లిలోని బాలయోగి గురుకులం (బాలికలు)తో పాటు మూడు ప్రయివేట్ ఉన్నత పాఠశాలలకు చెందిన 823 మంది పదో తరగతి రెగ్యులర్ విద్యార్థులు ఏప్రిల్ మూడో తేదీ నుంచి ప్రారంభమయ్యే పరీక్షలకు హాజరు కానున్నారని భీమడోలు విద్యాధికారి సాంబశివరావు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో భీమడోలు నుంచే అత్యధికంగా 176 మంది, ప్రయివేట్ పాఠశాలలో భీమడోలు మానస ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలకు నుంచి 162 మంది పరీక్షలకు హాజరు కానున్నారు. పదో తరగతి పరీక్షా కేంద్రాలుగా ఐదు ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేశామన్నారు. జంబ్లింగ్ విధానంలో పదో తరగతి విద్యార్థులకు పరీక్షా కేంద్రాలను కేటాయించినట్లు చెప్పారు. వీటిలో భీమడోలు మండలంతో పాటు పరిసరాల మండలాలకు చెందిన రెగ్యులర్, ప్రయివేట్ విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారన్నారు. దీనిలో భాగంగా గుండుగొలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కేంద్రంలో 240 మంది, భీమడోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కేంద్రంలో 340 మంది, పొలసానిపల్లి బాలయోగి గురుకులం(బాలికలు) పరీక్షా కేంద్రంలో 240 మంది, పూళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కేంద్రంలో 200 మంది, ఆగడాలలంకలోని జిల్లా పరిషత్ ఓరియంట్ ఉన్నత పాఠశాలలో 200 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. పరీక్షలు పారదర్శకంగా నిర్వహించడంతో పాటు పరీక్షా కేంద్రాల్లో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నామని మండల విద్యాధికారి తెలిపారు.

అత్యుత్తమ మార్కుల సాధనే లక్ష్యం



ఎంజె.జార్జి, ఇండో-సాక్సన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ కరస్పాండెంట్, సెక్రటరీ


ముదినేపల్లి : పదోతరగతి పరీక్షల్లో జిల్లాస్థాయిలో అత్యుత్తమ మార్కులు సాధించడమే లక్ష్యంగా తమ స్కూల్ విద్యార్థులను తీర్చిదిద్దుతున్నట్లు ముదినేపల్లిలోని ఇండో-సాక్సన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ కరస్పాండెంట్, సెక్రటరీ ఎంజె.జార్జి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ ఏప్రిల్ మూడో తేదీ నుంచి జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేసి రివిజన్ చేయిస్తున్నామన్నారు. ప్రతి విద్యార్థికి వ్యక్తిగత కౌన్సెలింగ్ నిర్వహించి విద్యార్థులకు పరీక్షలంటే భయం లేకుండా దిశానిర్దేశాలు చేస్తున్నామన్నారు. ప్రతివారం మాదిరి ప్రశ్నపత్రాలతో పరీక్ష నిర్వహించి విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నట్లు తెలిపారు. పరీక్షల నేపథ్యంలో విద్యార్థులకు మెళకువలు, సూచనలు, సలహాలు ఇస్తూ పరీక్షలకు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. విద్యలో వెనుక బడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రతివిద్యార్థిపై వ్యక్తి గత శ్రద్ధ తీసుకోవడంతో పాటు సబ్జెక్టుల వారీగా సూచనలు, సలహాలు అందిస్తున్నామన్నారు. నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నామని చెప్పారు.

ఇష్టానుసారంగా రహదారి విస్తరణ పనులు

ధ్వంసమైన కుళాయి పైపులైన్లు
డ్రెయినేజీ పాలవుతున్న తాగునీరు
పట్టించుకోని పంచాయతీ అధికారులు

ప్రజాశక్తి - మండవల్లి

మండవల్లిలో రహదారి విస్తరణ పనులు ఇమ్మడి ముమ్మడిగా, ఇష్టానుసారంగా నిర్వహిస్తున్నారు. దీంతో పైపులైన్లు ధ్వంసమై తాగునీరు డ్రెయినేజీ పాలవుతోంది. విస్తరణ పనులను అడ్డుకోకుండా సహకరించాలని గుత్తేదారుడు పంచాయతీకి చెందిన మధ్యవర్తితో కొంత పైకానికి ఒప్పందం కుదుర్చుకున్నట్లు సమాచారం. దీంతో కార్యదర్శి మధ్యవర్తితో చేతులు కలిపి సొమ్ము చేసుకుంటూ సమస్యలను గాలికి వదిలేయడంతో నెలల తరబడి స్వచ్ఛమైన తాగునీరు వృధాగా పోతున్నా పట్టించుకున్న పాపాన పోలేదని గ్రామస్తులు స్పష్టం చేస్తున్నారు. జాతీయ రహదారి అభివృద్ధి పనుల్లో భాగంగా గుత్తేదారుడు మొదటిగా మండవల్లిలో డ్రెయినేజీ నిర్మాణ పనులు ప్రారంభించాడు. ఈ క్రమంలో పంచాయతీ ప్రధాన పైపులతో పాటు వ్యక్తిగత కుళాయి పైపులు కూడా ధ్వంసమయ్యాయి. విస్తరణ పనులు నిర్వహించే క్రమంలో కలుగుతున్న అసౌకర్యాలకు ప్రజల నుంచి అభ్యంతరాలు వస్తాయని, వాటిని పట్టించుకుంటూపోతే పనులు నిర్వహించలేమని, చూసీచూడనట్లు వ్యవహరిస్తూ విస్తరణ పనులకు సహకరించాలని గుత్తేదారుడు ముందుగానే పంచాయతీకి చెందిన మధ్యవర్తితో రూ.లక్షల్లో ఒప్పందం కుదుర్చుకున్నట్లు సమాచారం. అంతేకాకుండా విస్తరణ పనులను అడ్డం పెట్టుకుని ఇదే అదునుగా భావించి వ్యక్తిగత కుళాయిలు లేనివారికి గుట్టుచప్పుడు కాకుండా వ్యక్తిగత కుళాయి కనెక్షన్ ఇచ్చేసి మధ్యవర్తి రూ.లక్షల్లోనే సొమ్ము చేసుకున్నాడని గ్రామస్తులు బహిరంగంగానే స్పష్టం చేస్తున్నారు. నిర్లక్ష్యంగా నిర్వహిస్తున్న విస్తరణ పనుల వల్ల పైపులైన్లు ధ్వంసమై తాగునీరు వృధాగా పోతుందని, దీంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని సర్పంచి దృష్టికి, కార్యదర్శి దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదని గ్రామస్తులు వాపోతున్నారు. మధ్యవర్తి కనుసన్నల్లో మెలుగుతూ కాసుల ముసుగులో కార్యదర్శి చూసీచూడనట్లు వ్యవహరించడంతో రెండు మంచినీటి పథకాల్లోని ఫిల్టర్ బెడ్లను సుమారు రూ.13 లక్షల ప్రజాధనం వెచ్చించి మరమ్మతులు చేయించి అందిస్తున్న స్వచ్ఛమైన తాగునీరు డ్రెయినేజీ పాలవుతుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధ్వంసమైన వ్యక్తిగత కుళాయిలకు మరమ్మతులు చేయించి తాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ అధికారులను కోరినప్పటికీ పట్టించుకోకపోవడంతో గ్రామస్తులు గుత్తేదారుడని నిలదీశారు. దీంతో గుత్తేదారుడు మరమ్మతులు చేసే బాధ్యత తమది కాదంటూ తామేమీ చేయలేమంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారని వారు స్పష్టం చేస్తున్నారు. డబ్బులు ఇస్తే మరమ్మతులు చేస్తామని గ్రామస్తుల నుంచి ముక్కు పిండి సుమారు రూ.400 నుంచి రూ.500 చొప్పున వసూలు చేసి వ్యక్తిగత కుళాయిలు మరమ్మతులు చేశారని, అయినప్పటికీ పంచాయతీ అధికారులు కన్నెత్తి చూడలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలు పంచాయతీలో మధ్యవర్తి ప్రమేయం ఏంటని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. పంచాయతీని అడ్డం పెట్టుకుని సొమ్ము చేసుకుంటున్న మధ్యవర్తితో ప్రజా సమస్యలను గాలికి వదిలేసి చేతులు కలిపి సొమ్ము చేసుకుంటున్న కార్యదర్శిపై చర్యలు తీసుకునేలా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని గ్రామస్తులు స్పష్టం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. దీనిపై కార్యదర్శి తోట శ్రీనివాసరావును వివరణ కోరగా విస్తరణ పనులు నిర్లక్ష్యంగా ఇష్టానుసారంగా జరుగుతున్న మాట వాస్తవమేనన్నారు. పైపులైన్లు ధ్వంసమై నీరు వృధాగా పోతున్న విషయం తన దృష్టికి రాలేదని, పరిశీలించి చర్యలు తీసుకుంటానని తెలిపారు.



పైపులైన్ ధ్వంసం కావడంతో బయటకు పోతున్న నీరు

రేచర్లలో వాటర్‌ప్లాంట్ ప్రారంభం

చింతలపూడి : ప్రజలందరికీ తాగునీరు అందించాలనే సంకల్పంతో సుజల వాటర్ ప్లాంట్‌ను నిర్మించినట్లు ఎంఎల్‌ఎ ఎలిజా అన్నారు. మండలంలోని రేచెర్ల గ్రామంలో దాతలు వెంకటరామిరెడ్డి, రెడ్డి సహకరంతో నిర్మించిన సుజల వాటర్ ప్లాంట్‌ని ఆయన గురువారం ప్రారంభించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఏలూరు : ఈ నెల 31వ తేదీ శుక్రవారం ఎపి ట్రాన్స్‌కో వారు 33 కెవి ఫీడర్స్‌నకు ఎంఆర్‌టి రిలే టెస్టింగ్ నిమిత్తం మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి.శశిధర్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఏలూరు వన్‌టౌన్, టూ టౌన్, పవర్‌పేట, సంతోష్‌నగర్, వట్లూరు, శాంతినగర్, శనివారపుపేట, పెదపాడు ఏరియా సరౌండింగ్ జానంపేట ఏరియా సరౌండింగ్‌కు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగే అవకాశాలు ఉన్నాయని, విద్యుత్ వినియోగదారులు సమకరించాలని కోరారు.

నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు : ఎస్‌పి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

జిల్లా ప్రజల శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా నేరాలను నిరోధించేందుకు పటిష్టమైన చర్యలు చేపడుతున్నామని ఎస్‌పి రాహుల్‌దేవ్‌శర్మ చెప్పారు. ఏలూరు, జంగారెడ్డిగూడెం, పోలవరం, నూజివీడు సబ్ డివిజన్లు, కైకలూరు సర్కిల్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల ప్రాంతాల్లోనూ మూడు రోజులపాటు వాహన తనిఖీలు చేపట్టారు. ఈ నెల 26, 27, 29 తేదీల్లో జిల్లా వ్యాప్తంగా వాహన తనిఖీలు చేపట్టి 1990 చలానాలు విధించి, కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి రాహుల్‌దేవ్‌శర్మ మాట్లాడుతూ జిల్లాలో వాహన తనిఖీలు చేయడం ద్వారా నేరాలను అరికట్టే అవకాశం ఉందన్నారు. వాహన తనిఖీలు నేరాలను నియంత్రించడానికి, అక్రమ రవాణాను అడ్డుకోవటానికి దోహదపడుతుందన్నారు. ద్విచక్ర వాహన దారులు హెల్మెట్ ధరించాలని సూచించారు. వాహనదారులం దరూ రోడ్డు నియమ నిబంధనలు పాటించాలని చెప్పారు.

యజమానులతో సంబంధం లేకుండా కౌలు కార్డులు ఇవ్వాలి

ప్రజాశక్తి - చింతలపూడి

యజమానులతో సంబంధం లేకుండా కౌలు రైతులకు కౌలు కార్డులు ఇచ్చే విధంగా చట్ట సవరణ చేయాలని కోరుతూ ఎంఎల్‌ఎ ఎలిజాకు రైతు సంఘం మండల కార్యదర్శి దొంత కృష్ణ గురువారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా దొంత కృష్ణ మాట్లాడుతూ మండలంలోని రేచర్ల గ్రామంలో పామాయిల్ రైతుల సమస్యలు పరిష్కరించాలని రైతు సంఘం నాయకులు కోరారు. పామాయిల్ పంట ఎకరానికి సంవత్సరానికి ఆరు నుంచి ఎనిమిది టన్నులు మాత్రమే వస్తుందని, దీంతో రైతులు, కౌలు రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. పామాయిల్ టన్ను ధర రూ.20 వేలుగా ప్రభుత్వం నిర్ణయించాలని కోరారు.

పల్లెల్లో గ్రామసింహాల బెడద

బెంబేలెత్తుతున్న జనం - పట్టించుకోని అధికారులు



ముదినేపల్లి, గురజ గ్రామాల్లో రోడ్లపై గ్రామసింహాల స్వైర్యవిహారం

ప్రజాశక్తి - ముదినేపల్లి

గ్రామ సింహాల బెడదతో మండల ప్రజలు వణికిపోతున్నారు. వాటి దాడికి గురవుతామోనని భయపపడుతున్నారు. మండలంలో అన్ని గ్రామాల్లో గ్రామసింహాలు స్వైరవిహారం చేస్తున్నాయి. వీటి బెడదతో గ్రామీణ ప్రాంత ప్రజలు గజగజలాడుతున్నారు. గ్రామసింహాలు రోడ్లపై రాత్రి, పగలు అనే తేడా లేకుండా తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. పలు గ్రామాల్లో గ్రామ జనాభా కన్నా గ్రామసింహాలే అధికంగా ఉన్నాయా అనే సందేహం ప్రజల్లో కలుగుతుంది. ఈ రీతిగా గ్రామసింహాల సంతతి పెరిగి గ్రామాల్లో ఎక్కువైపోవడంతో ప్రజలు వీటి చేష్టలతో భయందోళనలు చెందుతున్నారు. గ్రామ సింహాలు గుంపులుగుంపులుగా రోడ్డుపై వెళ్లే ద్విచక్ర వాహనదారులు, పాదచారులు, సైకిళ్లపై వెళ్లే వారి వెంట పడుతూ వారిని పరుగులు పెట్టిస్తున్నాయి. ఈ క్రమంలో ద్విచక్ర వాహనదారులు కంగారులో రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రధాన ఆర్‌అండ్‌బి రోడ్లపై గుంపులుగుంపులుగా వెళ్తూ వాహనాలకు అడ్డుపడుతూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తూ వాహనదారుల ప్రమాదాలకు కారణమవుతున్నాయి. రాత్రి సమయాల్లో అయితే వీటి ఆగడాలు మరింత ఎక్కువై ప్రజల వెంటపడుతూ ముప్పుతిప్పలు పెడుతున్నాయి. రాత్రి వేళ ప్రయివేటు నుంచి వచ్చే విద్యార్థుల వెంట, వివిధ ఫ్యాక్టరీల్లో పని చేసి రాత్రివేళ ఇంటికి వచ్చే కార్మికుల వెంట, కొత్త వ్యక్తులు ఎవరైన ఊర్లోకి వస్తే వారి వెంట గ్రామ సింహాలు పడుతూ వారికి చుక్కలు చూపిస్తున్నాయి. మండలంలోని అనేక గ్రామాల్లో నిత్యం గ్రామసింహాల కాటుకు గురైన వృద్ధులు, పిల్లలు, మహిళలు అనేకమంది ఉన్నారు. ముదినేపల్లికి చెందిన మహిళ ఎస్తేరురాణి నెల రోజుల వ్యవధిలో మూడు సార్లు గ్రామసింహాల కాటుకు గురైంది. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో వీటి బెడద అధికంగా ఉండడంతో మండల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. వీటి కాటుకు గురవుతున్న వారి సంఖ్యరోజురోజుకు పెరిగుతోంది. గ్రామ సింహాల కాటుకు గురైన బాధితులు ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లి చికిత్స పొందుతున్నారు. గ్రామ సింహాల విషయమై ఆయా గ్రామ పంచాయతీ పాలకవర్గాలకు చెప్పిన, అధికారులకు విన్నవించినా ఎవ్వరూ పట్టించుకోవడంలేదని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు గ్రామ సింహాల నిర్మూలనకు తగిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు అధికారులను ముక్తకంఠంతో కోరుతున్నారు.

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు తాడేపల్లిగూడెం

ఓ.పి.నెం. 3/2023

బిట్వీన్:

ప్రతాప వాసవి నారాయణి ...పిటీషనరు

మరియు

ప్రతాప బాల వెంకట సుబ్రమణ్యం ...రెస్పాండెంటు

పై నెంబరు ఓ.పి.లో శ్రీ కోర్టు వారు రెస్పాండెంటు అయిన ప్రతాప బాల వెంకట సుబ్రమణ్యం, తండ్రి: లేటు సుబ్రమణ్య శాస్త్రి, పౌరహిత్యం, డో.నెం. 3సి-17-37, క్రొత్త గంగానమ్మ గుడి వెనుక, పడమర వారి వీధి, ఏలూరు, ఏలూరు జిల్లా అయిన వారు నోటీసులు తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నందున వారికి Substitute Service ద్వారా నోటీసు అమలు చేయుటకు శ్రీ కోర్టు వారు ఉత్తర్వులు ఇచ్చినారు. కావున రెస్పాండెంటు **ది.20-04-2023వ తేదీ ఉదయం గం॥ 10:30 ని॥లకు ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా గాని హాజరై వారి అభ్యంతరములు తెలియజేయగలరు.** లేని ఎడల వారి పరోక్షమున శ్రీ కోర్టు వారు తీర్పు గావింతురు అని తెలియజేయడమైనది.

జి.కె.దుర్గాదేవి
తాడేపల్లిగూడెం, అడ్వకేట్, తాడేపల్లిగూడెం.
29-03-23. సెల్: 99855 92776

In the Court of the Special Magistrate, Tanuku

C.C. No. 50/2021

Between:

Petitioner/ Complainant:

అవిడి మధుసూదనరావు

మరియు

Respondent/ Accused:

కామన రాధాకృష్ణ

నిందితుడి హాజరు నిమిత్తం సెక్షన్ 82సి, ఆర్.పి.సి. ప్రకారం వేయించిన ప్రకటన

ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా, పై నంబరు గ్రంధములో ముద్దాయి కామన రాధాకృష్ణ, తండ్రి: శ్రీ రాంబాబు లోగడ డో.నెం. 5-164/1, వెంకటరామ నగర్, పైడిపర్రు, తణుకు, ప॥గో॥జిల్లా, ప్రస్తుత నివాసము: కేరాఫ్ కామన సత్యవతి, స్వాతి రెసిడెన్సీ, 5వ ఫ్లోర్, సజ్జాపురం, తణుకు, ప॥గో॥జిల్లా. మీపై ది. 26-12-2022న వారంటు జారీ కాబడినది. సదరు ఎన్.బి.డబ్ల్యు. అమలుకాక ముద్దాయి అయిన మీరు తప్పించుకొని తిరుగుచున్నందున ఫిర్యాది Crl. M.P. No. 28/23, సెక్షన్ 82 సి.ఆర్.పి.సి., ఆర్డర్ ప్రకారం ప్రొక్లమేషన్ వారంటు అనగా పేపర్‌లో పబ్లికేషన్ ద్వారా తెలియజేయునది ఏమనగా **ది. 11-4-2023వ తేదీన పై కోర్టు వారి ఎదుట ఉదయం గం॥ 10.00లకు** స్వయంగా గాని, ప్లీడరు ద్వారా గాని హాజరై మీ తాలూకు వాదన తెలియజేయవలయును. లేనిచో చట్టప్రకారం మీపై చర్యలు తీసుకొనబడునని తెలియజేయడమైనది.

E.RAMA KRISHNA, Advocate
D.No.16-6-1, Old Town
Tanuku, Cell: 9440120445

వాది తరుపున ప్రకటన

మహారాజశ్రీ తణుకు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఓ.ఎస్.నెం. 107/2019

వాది:

ఆళ్ళ వెంకట రామ గంగాధరరాజా, తండ్రి: బ్రహ్మానందరావు, సా॥ తణుకు.

మరియు

ప్రతివాది:

ఉమ్మిడి సీతారామయ్య, తండ్రి: వెంకట రామన్న, సా॥ హౌస్ నెం. 501, కె.సావరం, ఉండ్రాజవరం మండలం.

పై నెంబరు దావాలో ప్రోనోటు బాకీ రాబట్టుకొనుటకు వాది మీపై దావా దాఖలు చేసియున్నారు. శ్రీ కోర్టు వారు **ది.19-04-2023వ తేదీ ఉదయం గం॥ 10:30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి మీ ఆక్షేపణలను తెలియపరుచుకోవలెను.** లేని ఎడల శ్రీ కోర్టు వారు పరోక్షంగా తీర్మానించబడును.

జి.ఎన్.వి.ఎస్.సిహెచ్.వై.ప్రసాద్
తణుకు, అడ్వకేట్, తణుకు.
29-03-23. సెల్: 77992 35999

వాది తరుపున ప్రకటన

మహారాజశ్రీ తణుకు 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఓ.ఎస్.నెం. 60/2021

వాది:

వీరకోట బసవాపరదేశయ్య, తండ్రి: బసవా మల్లయ్య, సా॥ తణుకు.

మరియు

ప్రతివాది:

కనపర్తి సురేష్, తండ్రి: రమణ @ వెంకటేశ్వరరావు, సా॥ పాతూరు, తణుకు మండలం.

పై నెంబరు దావాలో ప్రతివాదిపై పిటీషను షెడ్యూలు ఆస్థికి రింట్ డిపాజిట్ చేయుటకు ఈ నెంబరు దావాను వాది ప్రతివాదిపై దావా దాఖలు చేయడమైనది. దావాలో ప్రతివాది వాదనలు దాఖలు చేయుటకు శ్రీ కోర్టు వారు **ది.14-04-2023వ తేదీకి వాయిదా వేసియున్నారు. వాయిదా రోజు ఉదయం గం॥ 10:30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి మీ ఆక్షేపణలను తెలియపరుచుకోవలెను.** లేని ఎడల శ్రీ కోర్టు వారు పరోక్షంగా తీర్మానించబడును.

జి.ఎన్.వి.ఎస్.సిహెచ్.వై.ప్రసాద్
తణుకు, అడ్వకేట్, తణుకు.
29-03-23. సెల్: 77992 35999

వేలం ప్రకటన

మహారాజశ్రీ అదనపు సీనియర్ సివిల్ జడ్జి, ఏలూరు, ప॥గో॥జిల్లా

ఇ.పి. నెం. 89/2015 ఇన్ ఒ.ఎస్. నెం. 367/2008

మధ్య:

శ్రీ బలే రామకృష్ణ ***...DHr/DHr***

మరియు

శ్రీ బలే గంగాధరరావు (డైడ్) మరియు యితరులు ***...JDRs/ JDRs***

పై నెంబరు గ్రంధములో DHr తన బాకీని పై JDR లు వద్ద నుంచి వసూలు చేసుకొనే నిమిత్తం దాఖలు చేసిన ఈ ఇ.పి. గ్రంధములో దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని **ది. 13-04-2023వ తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట బహిరంగంగా వేలం వేయబడును. వేలంలో పాడుకొనదలచినవారు ఉదయం గం॥ 10.30 ని॥లకు మీ ఆధార్ కార్డులతో వచ్చి షరతుల ననుసరించి వేలంలో పాల్గొనవలసినదిగా కోర్టు వారు ఆర్డరు వేసియున్నారు.

షెడ్యూలు ఆస్తి వివరం

పశ్చిమగోదావరి జిల్లా, ప్రస్తుతం ఏలూరు జిల్లా, భీమడోలు సబ్ రిజిస్ట్రారు, భీమడోలు మండలం, ఆగడాలలంక గ్రామం 1వ వార్డులో ఆర్.ఎస్. నెం. 1117/2రు దాఖలా పాత డోరు నెం. 1-5-7 నకు ప్రస్తుత డోరు నెం. 2-12 గల య. 0-09ట్లు ఆస్తిలో య. 0-03ట్లు ఖాళీ స్థలమునకు హద్దులు. **తూర్పు:** పంచాయతి రోడ్డు. **దక్షిణం:** JDR ల యొక్క మిగతా స్థలంలో గల పెంకుటిల్లు డోరు నెం. 2-12 (పాత డోరు నెం. 1-5-7). **పడమర:** రోడ్డు (గుండుగొలను టు చెట్టున్నపాడు). **ఉత్తరం:** కంసాల ధనాచార్యులు గారి వారసుల ఇల్లు మరియు స్థలం.

DHr Value : Rs. 2,50,000/-

JDR Value : పేర్కొనబడలేదు.

Amin Value : Rs. 2,00,000/- (తొమ్మిది సెంట్ల ఆస్తికి దానిని అనుసరించి దామాషాగా రూ. 1,33,333/-)

నోట్:

1. షెడ్యూలు ఆస్తి మీద ఎట్టి ఎన్‌కమ్బరెన్సులు లేవు.
2. వేలంలో ఆస్తిని కొనుగోలు చేయు ఆసామి వేలం అయిన వెంటనే నాల్గవ వంతు వేలపు సొమ్ము మరియు పౌండేజ్ ఫీజు చెల్లించవలెను.
3. మిగులు వేలపు సొమ్ము రిజిస్ట్రేషన్ ఖర్చులతో సహా సదరు వేలం తేదీ లగాయతు 15 రోజులలో చెల్లించవలెను.
4. వేలం నియమ నిబంధనలు తెలుసుకొనుటకు పై కోర్టు ఆఫీసు నందు గాని, సెంట్రల్ నజారత్ ఆఫీసు నందు గాని సంప్రదించవలయును.

(కోర్టు వారి ఉత్తర్వులననుసరించి ప్రకటన జారీ చేయడమైనది)

KURAPATI PRITHVI RAJ
ఏలూరు Advocate, Eluru
తేది:30-3-2023 Cell: 8019826216

గ్రామపంచాయతీ కార్యాలయము, పెదఅమిరం

సీల్డు టెండరు నోటీసు

ఠి.క. నెం. టెండరు/2023 **తేది.29-03-2023**

ది. 04-04-2023 సంవత్సరం తేదీ మంగళవారం మధ్యాహ్నం 03.00 గం॥ల వరకు దిగువ సంతకముదారునిచే ఈ దిగువ షెడ్యూలు దాఖలా కాంట్రాక్టు పనులు, అయిటములు సరఫరా నిమిత్తము సీల్డు టెండర్లు స్వీకరించి అదే రోజు హాజరు టెండర్ల సమక్షములో టెండర్లు తెరవబడును. ధరావత్తులు చెల్లించని, అసంపూర్తి, దిద్దివేతలు, కొట్టివేతలు గల టెండర్ల టెండరు తిరస్కరించబడును. ఎట్టి కారణము చూపకనే ఏ టెండరునైనా ఆమోదించుటకు, తిరస్కరించుటకు పంచాయతి కార్యదర్శి వారికి పూర్తి అధికారములు గలవు. ఇతర వివరములు ఈ దిగువ సంతకముదారు నుండి ఈ కార్యాలయం పని వేళల్లో అడిగి తెలుసుకొనవచ్చు.

వ.సం.	పని వివరములు	కాలపరిమితి	పనివారి వివరము	ధరావత్తు
1	ప్రజారోగ్య పనివారు ఏజెన్సీ ద్వారా	2023-24	20 మంది	10,000/-
2	నీటి సరఫరా పనివారు, ఎలక్ట్రీషియన్ పనివారు	2023-24	19 మంది	200/- చొప్పున
3	SWM షెడ్ వాచ్‌మెన్	2023-24	1	200/-
4	నీటి సరఫరా సామాగ్రి సరఫరా	2023-24	--	5000/- చొప్పున
5	ప్రజారోగ్య సామాగ్రి సరఫరా	2023-24	--	5000/- చొప్పున
6	విద్యుత్ అవసర విడిభాగముల సరఫరా	2023-24	--	5000/- చొప్పున
7	స్టేషనరీ సామాగ్రి సరఫరా	2023-24	--	5000/- చొప్పున

సం/- **డొక్కు సోమేశ్వరరావు**
సర్పంచ్, పెదఅమిరం,
కాళ్ళ మండలం, ప॥గో॥జిల్లా

సం/- **పి.కనకరావు**
గ్రామ కార్యదర్శి, పెదఅమిరం
కాళ్ళ మండలం, ప॥గో॥జిల్లా